www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | మంగళవారం,అక్టోబర్27,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:243 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ..

ఓవైపు ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పోరు.. మరోవైపు సుప్రీంకోర్టులో కీలక విచారణ. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశమైంది. 'సత్యం శివం సుందరం' అనే పదాలతో పాటు శివుడికి సంబంధించిన చిహ్నాన్ని ఆయన పంచుకున్నారు. ఎస్ఐఆర్‌పై పిటిషన్ల విచారణకు ముందు ఈ పోస్ట్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు కొనసాగించడం, అనర్హుల పేర్లను తొలగించడం కోసం చేపట్టే ప్రక్రియే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్). ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరపాలని కోరుతూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో విచారణలోనే ఉన్నాయి.

బ్యారేజీ ఎత్తు పెంపుపై స్వతంత్ర

అధ్యయనం చేస్తాం

ముంబైలో ఇరు రాష్ట్రాల సీఎంల చర్చలు మహారాష్ట్ర, తెలంగాణలకు వారధిగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ

- ఇరు రాష్ట్రాల సీఎ?సలు, ముఖ్య కార్యదర్శులతో కమిటీ వేద్దాం
- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం తదితరాలపై పరిశీలిద్దాం
- మహారాష్ట్ర నిబంధనల ప్రకారమే పరిహారం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, అక్టోబరు 26(సామాన్యుడి అస్త్రం)

తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి తెలంగాణ చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారు. తమ రాష్ట్ర ప్రజలపై ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తుకు అంగీకరిస్తూ గతంలో చేసుకున్న ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరిని కనబరిచిందని గుర్తు చేశారు. బ్యారేజీ ఎత్తుపై ఇప్పుడు తెలంగాణ విజ్ఞప్తిని పరిశీలించేందుకు తాము స్వతంత్రంగా అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బ్యారేజీ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణం తదితరాలను ఈ అధ్యయనంలో పరిశీలిస్తారని, దానిలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు కలిసి, చర్చించి, పరిశీలిస్తారని వివరించారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుందామని, వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేశారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి అనుమతులకు సంబంధించి మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం చర్చించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు, ప్రయోజనాలు తదితర అంశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా, తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని వెల్లడించారు. అయితే, తుది నిర్ణయానికి రావడానికి ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.



వైద్యం వృత్తి కాదు, ప్రాణాలు కాపాడే

పవిత్ర బాధ్యత

వర్సిటీ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష

- రూబీ జూబ్లీ జరుపుకుంటున్న సిబ్బంది, విద్యార్థులకు అభినందనలు
- సాంకేతికతకు మానవత్వం తోడైతే వైద్యానికి మరింత విలువ అని పేర్కొన్న సీఎం
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం.. సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబర్26,((సామాన్యుడి అస్త్రం)

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం (రూబీ జూబ్లీ) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భంలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.దివంగత ఎన్టీ రామారావు గారి సంకల్పంతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. నాణ్యమైన విద్య ద్వారా సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణమని అన్నారు.

బీఆర్ఎస్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది

- రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని చామల ఆరోపణ
- రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని విమర్శ


హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో నెలకొన్న కరవు పరిస్థితులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు సత్యదూరమైన విమర్శలు చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని, కేవలం రాజకీయాలే వారికి ముఖ్యమని ఆయన విమర్శించారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కరవు రావాలని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని, అందుకోసం ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.



ఒడిశాలో హై అలర్ట్

- అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటనున్న తుపాను
- ఒడిశాలోని ప్రభావిత జిల్లాల్లో అక్టోబర్ 28, 29 తేదీల్లో పాఠశాలలకు సెలవులు



న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్' తుపాను అక్టోబర్ 28న ఆంధ్ర ప్రదేశ్ తీరాన్ని దాటనున్న నేపథ్యంలో, పొరుగు రాష్ట్రమైన ఒడిశా అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, భారత వాతావరణ శాఖ ఒడిశాలోని ఐదు దక్షిణ జిల్లాలకు రెడ్ వార్నింగ్ జారీ చేసింది.



నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర

కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు.

చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు

- వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- మేనకోడలి పెళ్లికి మేనమామగా దీవించాల్సింది పోయి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారని వ్యాఖ్య
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పలువురు వైసీపీ, సీపీఎం నేతల చేరిక



అమరావతి, (సామాన్యుడి అస్త్రం)

వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లికి మేనమామ అన్నీతానై ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని లోకేశ్ తెలిపారు.దివంగత వైఎస్సార్ సొంత ఇంట్లో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని లోకేశ్ ఆరోపించారు. "సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైంది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఏపీపై 'ఆర్నబ్' పడగ


అమరావతి, అక్టోబర్26,



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రాన్ని వణికిస్తోంది. ఇది రానున్న 24 గంటల్లో 'ఆర్నబ్' తుపానుగా బలపడి, ఆ తర్వాత మరింత ఉగ్రరూపం దాల్చి 'అతి తీవ్ర తుపాను'గా మారే ప్రమాదముందని వాతావరణ కేంద్రం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీన విశాఖపట్నం -- మచిలీపట్నం మధ్య (కాకినాడకు సమీపంలోని యానాం వద్ద) ఈ తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర అంతటా మూడ్రోజుల పాటు వానల బీభత్సం తప్పదని అధికారులు స్పష్టం చేశారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

సర్వదర్శనానికి 15 గంటల సమయం



తిరుమల(సామాన్యుడి అస్త్రం)

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు.టైమ్ స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 15 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

అర్నాబ్ ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్

- అర్నాబ్ తుపాన్ ముప్పుతో పాపికొండల యాత్ర తాత్కాలికంగా రద్దు
- సోమవారం నుంచి బోట్ల రాకపోకలను నిలిపివేస్తూ అధికారుల ఆదేశాలు

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్' తుపాను హెచ్చరికల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండల విహార యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నుంచి గోదావరి నదిలో పర్యాటక బోట్ల రాకపోకలను పూర్తిగా రద్దు చేస్తూ రంపచోడవరం సబ్-కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.తుపాను ప్రభావంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం

- పధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు.



బ్యారేజీ ఎత్తు పెంపుపై స్వతంత్ర అధ్యయనం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

ఇరు రాష్ట్రాల సీఎ?సలు, ముఖ్య కార్యదర్శులతో కమిటీ వేద్దాం

బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం తదితరాలపై పరిశీలిద్దాం

వాస్తవాలు, అంచనాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుందాం

తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ స్పష్టీకరణ

తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని వెల్లడించారు. అయితే, తుది నిర్ణయానికి రావడానికి ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. "సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలి. మహారాష్ట్ర, తమ ప్రజలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు అభ్యంతరం లేదు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకూ ఎలాంటి అభ్యంతరం లేదు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం" అని వివరించారు.స్నేహ, సోదర భావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర గతంలో పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తు చేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల వనరుల సంఘం అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈలోపు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖల ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడణవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని నిర్దేశించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. గతంలో అనుమతి ఇచ్చిన తర్వాత ముంపు ప్రాంతం మరింత ఎక్కువగా ఉందని గుర్తించామని, అందుకే, ఈసారి సమగ్ర అధ్యయనం తప్పనిసరి అని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని, తదుపరి సమావేశాల నిర్వహణ, కాల పరిమితులను నిర్ణయించాలని సూచించారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్దేశించారు.

ఇరు రాష్ట్రాలకూ వారధి ఇది: సీఎం రేవంత్

"తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు. రెండు రాష్ట్రాలనూ భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుంది. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుంది. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతోపాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడంలో ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ– మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాలపరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు.

నీటి పారుదల శాఖ కార్యదర్శులతో ఉమ్మడి కమిటీ

ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో గ్రామాలు ముంపునకు గురికావని, రెండు రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందనే అంశాలపై అధ్యయనం చేయడానికి ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేద్దామని మహారాష్ట్ర సీఎం ప్రతిపాదించగా తెలంగాణ ప్రతినిధి బృందం అంగీకరించింది. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం, తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్‌ను ఖరారు చేసింది.

మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం: మంత్రి ఉత్తమ్

మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబరు 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య ఒప్పందం కుదిరిందని, దీనికి కొనసాగింపుగా వివిధ దశల్లో ప్రయత్నాలు జరిగాయని, అయినా, ఆశించిన పురోగతి సాధించలేకపోయామని తెలిపారు. "2016లో 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ కట్టడానికి ఒప్పందం జరిగింది. కానీ, దీనివల్ల తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవు. గ్రావిటీతో నీటిని తరలించలేము. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతుంది. అందుకే, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకర ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాలపరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఫడణవీస్ జీ.. ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు రండి

'హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. సమ్మిట్‌కు రండి' అని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు



మొదటి పేజీ తరువాయి

సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు.

లోకేశ్ సమక్షంలో చేరికలు

మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు నేతలను నారా లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు)లతో పాటు వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (ఈమని), ముద్రబోయిన శ్రీను, షేక్ యూసబ్ (చిలువూరు) టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అర్నాబ్ ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి సర్వీసులు నడిపే సుమారు 16 పర్యాటక బోట్లను నిలిపివేశారు.గతంలో గోదావరికి వచ్చిన భారీ వరదల కారణంగా సుమారు 70 రోజుల పాటు నిలిచిపోయిన పాపికొండల యాత్ర, కేవలం రెండు వారాల క్రితమే తిరిగి ప్రారంభమైంది. అప్పుడే పర్యాటకుల రాక కూడా పుంజుకుంటోంది. ఆదివారం ఒక్కరోజే మూడు బోట్లలో దాదాపు 199 మంది పర్యాటకులు పాపికొండల అందాలను వీక్షించారు. ఇంతలోనే తుఫాన్ ముప్పు రావడంతో యాత్రకు మరోసారి బ్రేక్ పడింది. తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారితేనే బోటింగ్ సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పర్యాటకులు ప్రస్తుతానికి గోదావరి నదీ ప్రాంతాలకు రావొద్దని సూచించారు.

బీఆర్ఎస్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది: ఎంపీ చామల

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మరోవైపు, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ జరగనుంది. కరవు నివారణ చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు స్వీకరించనున్నారు.రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు 358 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెలాఖరులోగా కరవు మండలాలను అధికారికంగా ప్రకటించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం

మొదటి పేజీ తరువాయి

ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

నవంబర్ 2న హైదరాబాద్‌లో
బీజేపీ పాదయాత్ర

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది.

వైద్యం వృత్తి కాదు, ప్రాణాలు కాపాడే పవిత్ర బాధ్యత

మొదటి పేజీ తరువాయి

నాణ్యమైన విద్య ద్వారా సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణమని అన్నారు."వైద్యం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. సాంకేతికత వైద్యానికి శక్తిని ఇస్తే, మానవత్వం దానికి మరింత విలువను చేకూరుస్తుంది" అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. 40 ఏళ్ల వైద్య సేవా స్ఫూర్తితో ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.



తిరుమలలో సాధారణంగా కొనసాగుతున్న భక్తుల రద్దీ


మొదటి పేజీ తరువాయి

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లలో నిండిన భక్తులు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 85,369 మంది

నిన్న హుండీ ద్వారా రూ. 4.13 కోట్ల ఆదాయం


క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్‌లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ సిబ్బంది పాలు, తాగునీరు మరియు అన్నప్రసాదాలను నిరంతరం అందిస్తున్నారు.నిన్న (ఆదివారం) శ్రీవారిని మొత్తం 85,369 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 26,414 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఒక్కరోజే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ అధికారులు తెలిపారు.



అర్నాబ్ తుపాను: ఒడిశాలో హై అలర్ట్..

మొదటి పేజీ తరువాయి

వివరాల ప్రకారం... గంజాం, గజపతి, రాయగడ, కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలపై తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు (20 సెం.మీ కంటే ఎక్కువ) కురుస్తాయని... గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో అక్టోబర్ 28, 29 తేదీల్లో ఈ ఐదు జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి... ప్రాణ నష్టం జరగకూడదనే లక్ష్యంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత



ఇవ్వాలని, అవసరమైన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఓడీఆర్ఏఎఫ్, అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచారు. తుపాను ప్రభావిత జిల్లాల అధికారుల సెలవులను రద్దు చేసి, హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ తుపాను బాపట్ల, విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే సమయంలో గంటకు 115-125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 140 కిలోమీటర్లకు చేరవచ్చని ఐఎండీ అంచనా వేసింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

అయ్యప్ప సొసైటీలో బోర్ల జోరు.. స్పందన ఏది?

- అనుమతులు లేకుండా తవ్వుతున్నారని మల్లారెడ్డి ఆరోపణ
- ఫొటోలు, లొకేషన్ పంపినా చర్యలు లేవని విమర్శ
- తక్షణ తనిఖీలు చేసి బోరు వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్

సామాన్యుడి అస్త్రం / మాదాపూర్ :

అయ్యప్ప సొసైటీలో అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్నారని, ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మిద్దెల మల్లారెడ్డి ఆరోపించారు. భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత ప్రదేశాల్లో వెంటనే తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకపోతే బోరు వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.అయ్యప్ప సొసైటీ ప్రధాన రహదారైన 100 ఫీట్ రోడ్డులోని బేల్ హోటల్ పక్కనున్న స్థలంతో పాటు ప్లాట్ నంబరు 687లో పట్టపగలే బోర్లు తవ్వుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు బోరు వాహనాలతో అధిక లోతులో తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. వాటి ఫొటోలు తీసి, వాట్సాప్ ద్వారా లొకేషన్ కూడా పంపించినట్లు వెల్లడించారు.ఈ విషయాన్ని తెలియజేసేందుకు శేరిలింగంపల్లి తహసీల్దార్ మైపాల్‌రెడ్డికి ఫోన్ చేసినా స్పందన రాలేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. సంబంధిత ఆర్ఐ సాయికిరణ్‌కు ఫోన్ చేయగా తొలుత పరిశీలిస్తామని చెప్పారని, ఆ తర్వాత చేసిన కాల్స్‌కు సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అందుబాటులో లేకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు.భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో ఇష్టారీతిన బోర్లు తవ్వితే భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తీవ్రమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. జలవనరుల పరిరక్షణపై ప్రకటనలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కోరారు. బోర్లు వేస్తున్న ప్రదేశాల్లో అనుమతులను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.అయ్యప్ప సొసైటీలో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, పర్యవేక్షణకు అధికారులను నియమించాలని మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్



వారానికి ఒకరోజు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదులను పరిశీలించాలని కోరారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి, తీసుకున్న చర్యలను తెలియజేయాలన్నారు. స్పందన లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

కార్మికుల ప్రాణాలకు భరోసా ఏది?

- పరిశ్రమల ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి
- ఫ్యాక్టరీస్ శాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం: మెట్టు శ్రీధర్

సామాన్యుడి అస్త్రం / సంగారెడ్డి బ్యూరో :

ఫార్మా, రసాయన పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ విమర్శించారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని, సరాక, సిగాచి ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సరాక లాబొరేటరీస్ ప్రధాన ద్వారం వద్ద ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్‌గోపాల్ యాదవ్, యువజన సంఘాల సమితి సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్‌సింగ్, మనీష్‌లతో కలిసి ఆయన నిరసన తెలిపారు. సరాకలో క్లోరోఫార్మ్ లీకేజీతో ఇద్దరు కార్మికులు మరణించగా, మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు.భద్రతా లోపాలు, యాజమాన్యాల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నాయని శ్రీధర్ ఆరోపించారు. ఫ్యాక్టరీస్ శాఖ తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా స్పందన లేదన్నారు. డైరెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఖాళీలను తక్షణమే భర్తీ చేసి పర్యవేక్షణను బలోపేతం చేయాలని కోరారు.సిగాచి మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ప్రకటించినా, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా మొత్తాలను కలిపి కేవలం రూ.42 లక్షలే చెల్లించారని ఆరోపించారు. ఈ అంశంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. సరాక మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల పరిహారం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులు వైద్య ఖర్చులు, ఉపాధిలేమితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన



వ్యక్తం చేశారు.నిర్లక్ష్యం వహించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం, తీవ్రంగా గాయపడిన వారికి పూర్తి వైద్య సహాయం, జీవితాంతం పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో అత్యవసర ప్రణాళికలు, ప్రమాద నివారణ నిబంధనల అమలుపై ఏటా సమగ్ర తనిఖీలు జరపాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార దందా!

- మాదాపూర్‌లో పోలీసుల సంయుక్త దాడి.. నిర్వాహకుడి కోసం గాలింపు - చంద్రనాయక్ తండాలోని ఓరియన్ ఎలిగెంట్‌లో తనిఖీలు
- ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలు రెస్క్యూ హోమ్‌కు తరలింపు - నివాసితుల గుర్తింపు పత్రాలు పరిశీలించాలని అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు సూచన



సామాన్యుడి అస్త్రం / మాదాపూర్ క్రైమ్ :

బస కోసం వినియోగించే సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. మాదాపూర్ పోలీసులతో కలిసి కూకట్‌పల్లి ఎస్ఓటీ బృందం చేపట్టిన ఈ తనిఖీల్లో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను గుర్తించారు. వారిని స్టేట్ రెస్క్యూ హోమ్‌కు తరలించారు. వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయక్ పరారీలో ఉండటంతో అతడి కోసం గాలింపు చేపట్టారు.

రాత్రివేళ సంయుక్త దాడి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రాత్రివేళ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ వ్యభిచార కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్న నాయక్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.తనిఖీల సమయంలో గుర్తించిన ముగ్గురు విదేశీ మహిళలను స్టేట్ రెస్క్యూ హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

గుర్తింపు పత్రాలు పరిశీలించాకే బసకు అనుమతి

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లలో బస చేసేవారి వివరాలను నిర్వాహకులు తప్పనిసరిగా పరిశీలించాలని మాదాపూర్ పోలీసులు సూచించారు. సంబంధిత వ్యక్తుల గుర్తింపు పత్రాలను తనిఖీ చేసిన తర్వాతే బసకు అనుమతించాలని కోరారు.



ఎండీఎంఏ డ్రగ్స్ తో పట్టుబడిన ఫొటోగ్రాఫర్



- ఖాజాగూడ--నానక్‌రామ్‌గూడ సర్వీసు రోడ్డులో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ దాడి
- కారు, డిజిటల్ త్రాసు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఒకరి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

సామాన్యుడి అస్త్రం / గచ్చిబౌలి క్రైమ్ :

వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్.. అదనపు ఆదాయం కోసం మాదకద్రవ్యాల విక్రయాలు సాగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారుల గుర్తింపు. కారులో ఎండీఎంఏ ఉంచుకుని అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ఆకుల సాయిరామ్‌ను ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందం పట్టుకుంది. ఖాజాగూడ--నానక్‌రామ్‌గూడ సర్వీసు రోడ్డు వద్ద నిర్వహించిన దాడిలో అతడి నుంచి 4.45 గ్రాముల ఎండీఎంఏ, ఎరుపు రంగు వోక్స్‌వ్యాగన్ పోలో కారు, చిన్న డిజిటల్ త్రాసు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రూ.25 వేలకు కొనుగోలు.. గ్రాముల లెక్కన విక్రయం

ఎక్సైజ్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఆకుల సాయిరామ్, రామిరెడ్డి మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర ప్రస్తుతం మణికొండలో నివాసం ఉంటున్నారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పనులు చేసే సాయిరామ్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.మహేశ్‌రెడ్డి, హరిశ్చంద్ర నుంచి రూ.25 వేలకు ఎండీఎంఏ కొనుగోలు చేసిన సాయిరామ్.. దానిని చిన్న డిజిటల్ త్రాసుతో తూకం వేసి గ్రాముకు రూ.10 వేల చొప్పున నగరంలోని యువత, ఇతర వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఖాజాగూడ--నానక్‌రామ్‌గూడ సర్వీసు రోడ్డు వద్ద కారులో మత్తుపదార్థాన్ని ఉంచుకుని విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా ఎస్టీఎఫ్ బృందం అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

కొండాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగింత

అరెస్టు చేసిన సాయిరామ్‌తో పాటు స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ, కారు, ఇతర వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం కొండాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న మహేశ్‌రెడ్డి, హరిశ్చంద్ర కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టాలన్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మోహంతి ఆదేశాల మేరకు ఈ దాడి నిర్వహించినట్లు వెల్లడించారు. ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ ఆధ్వర్యంలో సంతోష్, ప్రసాద్, ప్రభు, సతీశ్, రాహుల్ తనిఖీల్లో పాల్గొన్నారు. మత్తుపదార్థాలను పట్టుకున్న బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

విజయ్--రష్మికపై తప్పుడు ప్రచారం.. పోలీసులకు ఫిర్యాదు

- మార్ఫింగ్ స్క్రీన్‌షాట్లు, నకిలీ ప్రొఫైల్స్‌పై అభ్యంతరం
- ఆధారాలు అందజేసిన విరోష్ టీమ్ ప్రతినిధులు
- పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్న అడిషనల్ డీసీపీ


సామాన్యుడి అస్త్రం / గచ్చిబౌలి :

నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విరోష్ టీమ్ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి అడిషనల్ డీసీపీ ఉదయ్‌రెడ్డిని కలిసి, సంబంధిత ఆధారాలను అందజేశారు. నిరాధారమైన కథనాలు, మార్ఫింగ్ చేసిన స్క్రీన్‌షాట్లు, నకిలీ ప్రొఫైల్స్‌తో వేధింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విజయ్, రష్మికల గురించి ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని టీమ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పోస్టులు, స్క్రీన్‌షాట్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ ఖాతాల ద్వారా జరుగుతున్న ప్రచారంతో వారి ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పోస్టులు పెడుతున్న వారితో పాటు, పెయిడ్ క్యాంపెయిన్లు నిర్వహిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.భావప్రకటన స్వేచ్ఛను తాము గౌరవిస్తామని విరోష్ టీమ్ స్పష్టం చేసింది. అయితే ఆధారాలు లేని విషయాలను నిజాలుగా ప్రచారం చేయడం, మార్ఫింగ్ చేసిన సమాచారంతో వ్యక్తులను వేధించడం సరికాదని పేర్కొంది. ఇటువంటి నిరాధార ప్రచారాలను అడ్డుకోవాలన్న ఉద్దేశంతోనే పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపింది.ఫిర్యాదును పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ ఉదయ్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.



290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు..

మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం
ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం



హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేరిట నకిలీ ఖాతాలు.. రంగంలోకి పోలీసులు



కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు
వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించిన కేటుగాళ్లు
కలెక్టరేట్ ఏవో ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

ఉన్నతాధికారుల పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతాలు సృష్టించడం కలకలం రేపింది. ఈ ఘటనపై కలెక్టరేట్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.కేటుగాళ్లు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేరుతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీలు తెరిచి వాటిని సర్కులేట్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నకిలీ ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దీనివల్ల కలెక్టరేట్ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని కామారెడ్డి కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి (ఏవో) అహ్మద్ హుస్సేన్ దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అహ్మద్ హుస్సేన్ ఫిర్యాదు ఆధారంగా సైబర్ నేరం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు. నిందితులను గుర్తించేందుకు ఐపీ అడ్రస్, ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశామని ఆయన వివరించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లతో వచ్చే మోసపూరిత సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

తెలంగాణలో వడ్లకు రికార్డు ధర..

తెలంగాణలో వడ్లకు రికార్డు స్థాయిలో ధరలు
కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలు జై శ్రీరామ్ వడ్లు రూ. 5,016
సాగు తగ్గడం, పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడమే కారణం
ప్రభుత్వ మద్దతు ధరను మించిపోవడంతో పౌరసరఫరాల శాఖకు సవాల్
రిటైల్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 100కు చేరిక



హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధరల పెరుగుదలకు కారణాలివే..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.


ప్రభుత్వానికి సవాల్.. వినియోగదారులపై భారం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (గ్రాఖా) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది.

రైతుల హర్షం.. ప్రభుత్వ స్పందన

"వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

సన్న బియ్యం సరఫరాలో మోసం.. 14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసిన సీఐడీ



ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో అక్రమాలు
సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు
నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో వెలుగుచూసిన మోసం
ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా

హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అరెస్ట్ చేసింది. 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 'సన్న రకం' బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో నాసిరకం 'దొడ్డు బియ్యాన్ని' అందజేసినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి.పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న అందజేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని, అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించగా, అవి నిర్దేశిత సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయ్యింది.నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న బియ్యానికి బదులుగా సుమారు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనివల్ల ప్రభుత్వానికి బోనస్ రూపంలో సుమారు రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి బియ్యం సేకరణను నిలిపివేయడంతో సుమారు రూ.242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని నివారించగలిగారు.ఈ ఉదంతంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. బియ్యం మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ జరుపుతున్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

కృష్ణా జలాలపై నేడు కీలక భేటీ!



(సామాన్యుడి అస్త్రం)హైదరాబాద్, అక్టోబర్26

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం నేడు జరగనుంది. ఈ భేటీలో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై ప్రధానంగా చర్చించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలు, ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీకి సంబంధించిన అంశాలను సమావేశంలో పరిశీలించనున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై ఈ సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించాలనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి నిల్వలు, నీటి వినియోగం, రాష్ట్రాల అవసరాలపై బోర్డు సమీక్షించనుంది. నీటి పంపిణీ విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం, జలాశయాల నిర్వహణకు సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రెండు రాష్ట్రాల నీటి వినియోగంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ప్రాధాన్యం ఏర్పడింది. అయితే నీటి కేటాయింపులపై తుది నిర్ణయాలు, సమావేశంలో వెల్లడయ్యే వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త.. త్వరలో ఫైనల్ బిల్లులు!



ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనులకు అటవీ అధికారులు అడ్డంకులు సృష్టించొద్దు.. ఎమ్మెల్యే కోవ లక్ష్మి



హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

: గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్లో ఏర్పాటు చేసిన ప్రజాధర్బార్లో పాల్గొని ఆమె మాట్లాడారు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. కొమురం భీం నుంచి సమ్మక్క--సారలమ్మ, బిర్సా ముండా వరకు సాగిన ఆదివాసీల పోరాట స్ఫూర్తి నేటికీ కొనసాగుతోందన్నారు. జల్.. జంగిల్.. జమీన్ (నీరు.. అడవి.. భూమి) హక్కుల సాధనే ఆదివాసీల పోరాటాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గిరిజనులపై కేసులు పెట్టడం సరికాదు..

అటవీ శాఖ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోవ లక్ష్మి సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు, ప్రజల కనీస అవసరాల కల్పనకు అడ్డంకులు సృష్టించవద్దని స్పష్టం చేశారు. గిరిజనులపై కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

7న ఏఈఈ పరీక్ష

రీషెడ్యూల్ చేసిన టీజీపీఎస్సీ
జేఈ టెస్ట్ రాసే వారికే మినహాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 26 (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్() (టీజీపీఎస్సీ) నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్() (ఏఈఈ) పరీక్ష తేదీపై కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల(విజ్ఞప్తులపై కమిషన్ స్పందించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజినీర్ (జేఈ) పరీక్ష తేదీ, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్ష తేదీ నవంబర్ 6నే కావడం.. రెండు పరీక్షలకు ప్రిపేరైన అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో పలువురు కమిషన్‌ను ఆశ్రయించారు.

'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'..
సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫైర్!

సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి
పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
30 వేల మందితో దీక్షకు సిద్ధమని ప్రకటన
మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న
సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో సొంత ప్రభుత్వంపైనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చస్తే గానీ బిల్లులు చెల్లించరా? అంటూ ప్రశ్నించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా?

ప్రభుత్వం, సచివాలయం తీరుపై అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం తాను చనిపోతేనే నిధులు విడుదల చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీళ్ల కోసం పార్టీలకు అతీతంగా పోరాటం

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం నిలబడుతుందని అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని చెప్పారు.తన నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

హీరోయిన్లతో కేటీఆర్ దుబాయ్ వెళ్లారు



'రామ్ కేటీ', 'కే రామ్' పేర్లతో ప్రయాణించారని ఆరోపణ
కొడుకుపై ఒట్టేసి చెప్పాలని కేటీఆర్‌కు సవాల్

కేసీఆర్, జగన్ భేటీపైనా పాత విషయాల ప్రస్తావన

హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ తీవ్రమైన వ్యక్తిగత ఆరోపణలు చేశారు. కేటీఆర్ తన పేరును మార్చుకుని ఇద్దరు హీరోయిన్లతో కలిసి దుబాయ్ వెళ్లారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.'రామ్ కేటీ', 'కే రామ్' అనే పేర్లతో కేటీఆర్ ఇద్దరు హీరోయిన్లు, మరో ఇద్దరు ప్రముఖులతో కలిసి దుబాయ్‌కు వెళ్లారని ఆరోపించారు. ఎవరికీ దొరక్కుండా ఉండేందుకే హైదరాబాద్ నుంచి నేరుగా కాకుండా, బెంగళూరు, ఢిల్లీ మీదుగా ప్రయాణించారని పేర్కొన్నారు. తాను చెబుతున్నవి అబద్ధమైతే, తన కొడుకు మీద ఒట్టేసి చెప్పగలరా అని కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు.కేటీఆర్ ఒక రాక్షసుడని, ఆయన వల్ల మహిళలకు ప్రమాదమని, ఆయన భయంతోనే టాలీవుడ్ నిర్మాతలు, దర్శకులు తెలంగాణలో సినిమాలు తీయలేకపోతున్నారని వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా విమర్శించారు. గతంలో వైసీపీ అధినేత జగన్ తో కేసీఆర్ ఎందుకు చర్చలు జరిపారని, వైసీపీ నేత రోజా ఇంట్లో రొయ్యల కూర ఎందుకు తిన్నారని పాత విషయాలను కూడా ప్రస్తావించారు.

హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు: ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పురోగతి
ఇంట్లో పనిచేసే యువతి సహా నలుగురు నేపాలీ నిందితుల అరెస్ట్
దోపిడీని అడ్డుకోవడంతో మహిళను ఊపిరాడకుండా చేసి హత్య చేసిన ముఠా
పనిమనిషి ధర్మ అలియాస్ కల్పననే కీలక సూత్రధారిగా గుర్తించిన పోలీసులు
దేశవ్యాప్తంగా, నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలలు గాలించి నిందితులను పట్టుకున్న సిట్

హైదరాబాద్, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (ౘఒ) దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, భారత్-నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలల పాటు గాలించి నిందితులను కదలికలను గుర్తించారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో ఈ అరెస్టుల వివరాలను వెల్లడించారు. నిందితులైన ధర్మ అలియాస్ కల్పన (26), గణేశ్ బి.కె (31), చంద్ర బహదూర్ ధమన్ (44), గణేశ్ బహదూర్ షాహి (37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు.

పక్కా ప్రణాళికతో దోపిడీ, హత్య


పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 7, 8 తేదీల మధ్య రాత్రి ప్రశాసన్ నగర్‌లోని తనూజ రంజన్ నివాసంలోకి చొరబడిన నిందితులు, ఆమెను కదలకుండా బంధించి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లోని 225 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పరారయ్యారు.ఈ కేసులో ఇంట్లో పనిచేసే ధర్మ తిరువా అలియాస్ కల్పన (26) కీలక పాత్ర పోషించింది. నేపాల్‌లోని సుర్ఖేత్ జిల్లాకు చెందిన కల్పన, జూన్ 2025లో బంధువుల ద్వారా హైదరాబాద్ వచ్చి, నెలకు రూ. 20,000 జీతానికి తనూజ ఇంట్లో పనికి కుదిరింది. పనిలో చేరినప్పటి నుంచి పుణెలో ఉంటున్న బికాస్ అనే నేపాల్ జాతీయుడితో ఆమె టచ్‌లో ఉంది. యజమానురాలి ఇంట్లో ఉన్న ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాల గురించి బికాస్ తరచూ అడిగి తెలుసుకునేవాడు. ఇంట్లో దోపిడీకి సహకరిస్తే వాటా ఇస్తానని ఆశ చూపడంతో కల్పన అంగీకరించింది.

నేరానికి ముందు ఏం జరిగింది?

ఏప్రిల్ 2026లో అనారోగ్యంతో ఉన్న తన తండ్రిని చూసేందుకు పుణే వెళ్లిన కల్పన, అక్కడ ఈ ముఠాలోని ఇతర సభ్యులను కలుసుకుంది. మే 4న యజమానురాలు తనూజ బెంగళూరు వెళ్తున్నట్లు తెలియగానే, కల్పన వెంటనే ముఠాకు సమాచారం ఇచ్చింది. దీంతో మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో గణేశ్ బహదూర్ షాహి, శంకర్ చంద్ర లామా, సునీల్ పరియార్ సమావేశమై, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారులో పుణే చేరుకున్నారు. అక్కడ మరికొందరితో కలిసి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు.మే 7న ఉదయం, గణేష్ బి.కె., సురేష్ షాహి అనే ఇద్దరు నిందితులు కల్పనను కలిసి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోకి ఎలా ప్రవేశించాలనే దానిపై చర్చించుకున్నారు. అదే రోజు సాయంత్రం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ సమీపంలోని రవీంద్ర బార్ వద్ద ముఠా సభ్యులందరూ సమావేశమై, సుజన్ షాహి అలియాస్ సురేష్ షాహి నేతృత్వంలో రెండు బృందాలుగా విడిపోయారు. గణేష్ బి.కె., సురేష్ షాహి, శంకర్ లామా దోపిడీ చేసేందుకు ఇంట్లోకి వెళ్లాలని, గణేష్ బహదూర్ షాహి, సునీల్ పరియార్, నేత్ర షాహి బయట నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద కాపలా కాయాలని నిర్ణయించుకున్నారు.

అర్ణబ్ తుపాను: అతి భారీ వర్షాలు.. గంట గంటకూ పరిస్థితి సమీక్షిస్తోన్న చంద్రబాబు

బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
యానాం వద్ద ఈ నెల 28న తీరం దాటనున్న తుపాను
కోస్తాంధ్రలోని 11 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం
ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు



అమరావతి, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకూ పరిస్థితిని సమీక్షిస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. తుపాను గమనాన్ని, ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు.భారత వాతావరణ విభాగం (×వీణ) హెచ్చరికల ప్రకారం, అర్ణబ్ తుపాను రేపటికల్లా తీవ్ర తుపానుగా బలపడి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. ఈ నెల 28వ తేదీన బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద ఇది తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో రేపు మధ్యాహ్నం నుంచి ఉత్తర కోస్తాంధ్ర, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా సమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు, సహాయక చర్యలు

తుఫాన్ నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు (షెల్టర్లకు) తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులు, బాలింతలు, చిన్నారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభావిత జిల్లాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 జిల్లాల్లో మోహరించాలని, అదనపు బలగాలను ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సేవలను కూడా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

తుపాను వల్ల పంట నష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, రేషన్ సరకులు అందుబాటులో ఉంచాలన్నారు.తుపాను గమనాన్ని బట్టి ప్రతి నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. తుపాను తీవ్రతను బట్టి ప్రభావిత ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత విమర్శలు చేయను: వంగవీటి రాధా

విజయవాడ మేయర్ బరిలో వంగవీటి రాధా, ఏబీ వెంకటేశ్వరరావు
నగరాభివృద్ధి కోసం ఏబీవీ సలహాలు తీసుకుంటానన్న వంగవీటి
రాధాతో తనకు 20 ఏళ్ల నుంచి పరిచయం ఉందన్న ఏబీవీ



అమరావతి, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

విజయవాడ నగర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యాలని కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా స్పష్టం చేశారు. నగరంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఇబ్బంది పడకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. రాజకీయ ప్రత్యర్థి అయిన ఏబీ వెంకటేశ్వరరావు అనుభవాన్ని గౌరవిస్తానని, నగరాభివృద్ధికి ఆయన ఇచ్చే మంచి సూచనలు తప్పక స్వీకరిస్తానని తెలిపారు. నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయబోనని, విశ్వసనీయతకే కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.మరోవైపు, ఏబీ వెంకటేశ్వరరావు కూడా రాధాతో తనకు 20 ఏళ్ల పరిచయం ఉందని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయబోనని ప్రకటించారు. తమ మధ్య పోటీ రాజకీయపరమైనదే కానీ, వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఆత్మీయ పలకరింపు.. ఎన్నికల వాతావరణంలో హుందాతనాన్ని నింపింది. నవంబర్ 1న మేయర్ ఎన్నికకు పోలింగ్ జరగనుండగా, ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.బెజవాడ మేయర్ పీఠం కోసం ఎన్డీయే కూటమి నుంచి వంగవీటి రాధా, వామపక్షాలు-కాంగ్రెస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, వైసీపీ నుంచి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మధ్య త్రిముఖ పోరు నెలకొన్న విషయం తెలిసిందే.

'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం
అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ
గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం
రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన
అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (×వీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా



ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర(ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు.

తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు.. హాజరుకానున్న మోదీ, అమిత్ షా



డిసెంబర్ 4 నుంచి 6 వరకు తిరుపతిలో డీజీపీ, ఐజీల సదస్సు హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా
తిరుపతి ఐసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సమావేశం
ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష
పారపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి, అక్టోబర్26(సామాన్యుడి అస్త్రం)

దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వార్షిక సదస్సు ఈసారి తిరుపతిలో జరగనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో పాటు కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (××ూఱ=) ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది.ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులందరూ హాజరవుతున్నందున, భద్రత, వసతి, రవాణా తదితర అంశాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. అలాగే, తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్ విధానంలో పాలుపంచుకున్నారు.



ఆటిజం మెదడుపై కొత్త పరిశోధన..

తప్పులు చేశారని చెప్పినప్పుడు ఆటిజం ఉన్నవారి మెదడు తక్కువగా స్పందిస్తుందన్న కొత్త అధ్యయనం ఈ కారణంగానే వారు పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తనను మార్చుకోవడంలో ఇబ్బంది పడొచ్చని విశ్లేషణ ధ్వనులను గుర్తించే టాస్క్ ద్వారా మెదడు పనితీరును పరిశీలించిన శాస్త్రవేత్తలు ఆత్మవిశ్వాసం, గత విజయాలు కూడా ఆటిజం ఉన్నవారి నిర్ణయాలపై తక్కువ ప్రభావం చూపుతున్నట్టు గుర్తింపు ఈ సంయుక్త పరిశోధన చేసిన నాటింగ్‌హామ్ ట్రెంట్, హీబ్రూ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు



ఆటిజం ఉన్న వ్యక్తుల మెదడు పనితీరుపై జరిపిన ఒక కొత్త అధ్యయనంలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏదైనా పొరపాటు చేసినప్పుడు, ఆ విషయాన్ని వారికి తెలియజేస్తే వారి మెదడు తక్కువగా స్పందిస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ తేడా కారణంగానే, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రవర్తనను సర్దుబాటు చేసుకోవడంలో కొందరు ఆటిజం వ్యక్తులు ఎందుకు ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవచ్చని పరిశోధకులు వివరిస్తున్నారు. నాటింగ్‌హామ్ ట్రెంట్ యూనివర్సిటీ, జెరూసలేంలోని హీబ్రూ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పరిశోధన వివరాలు 'ది జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్'లో ప్రచురితమయ్యాయి.ఈ అధ్యయనం కోసం, పరిశోధకులు కొందరు ఆటిజం ఉన్న పెద్దలు, మరికొందరు ఆటిజం లేని పెద్దల మెదడు పనితీరును రికార్డ్ చేశారు. వారికి ధ్వనులను గుర్తించే ఒక టాస్క్ ఇచ్చి, వారి మెదడు కార్యకలాపాలను నిశితంగా గమనించారు. వారు ఇచ్చిన సమాధానం తప్పు అని చెప్పినప్పుడు వారి మెదడు ఎలా స్పందిస్తుంది, ఆ ఫీడ్‌బ్యాక్ వారి తదుపరి నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఆటిజం లేని వ్యక్తులతో పోలిస్తే, ఆటిజం ఉన్నవారిలో నెగటివ్ ఫీడ్‌బ్యాక్‌కు మెదడు ప్రతిస్పందనలు బలహీనంగా ఉన్నాయని కనుగొన్నారు.పరిశోధనలో పాల్గొన్న ఆటిజం లేని వ్యక్తులు తాము తప్పు చేశామని చెప్పినప్పుడు వారి మెదడులో బలమైన ప్రతిస్పందనలు కనిపించాయి. అంతేగాక వారు తీసుకునే నిర్ణయాలు ఒక పని ఎంత సులభంగా లేదా కష్టంగా ఉంది, దానిపై వారికి ఎంత ఆత్మవిశ్వాసం ఉంది అనే అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఒక సులువైన పనిని సరిగ్గా పూర్తి చేసినప్పుడు, ఆ విజయం వారి తదుపరి ఎంపికలను ఎక్కువగా ప్రభావితం చేసింది.దీనికి భిన్నంగా, ఆటిజం ఉన్న పార్టిసిపెంట్లలో నెగటివ్ ఫీడ్‌బ్యాక్‌కు మెదడు ప్రతిస్పందనలు చాలా బలహీనంగా ఉన్నాయి. వారి ఆత్మవిశ్వాసం స్థాయిలు తప్పుల నుంచి పాఠాలు నేర్చుకునే విషయంలో ఆటిజం ఉన్న, లేని వ్యక్తులు వేర్వేరు వ్యూహాలను అనుసరిస్తారని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది.

ఏఐపై భారీ పెట్టుబడులు.. 60,000 మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్!



ఏఐపై భారీ పెట్టుబడుల నేపథ్యంలో ఖర్చుల నియంత్రణకు చర్యలు

భారత్, అమెరికా, యూకే, కెనడాలోని ఉద్యోగులకు అవకాశం

కోపైలట్, విండోస్, ఎక్స్‌బాక్స్ వంటి కీలక విభాగాలకు ఆఫర్ వర్తింపు

డిసెంబర్ నాటికి నిర్ణయం చెప్పి, నెలాఖరుకు విధుల నుంచి వైదొలగే అవకాశం

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ ఉద్యోగులకు ఒక కీలకమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో, ఖర్చులను నియంత్రించేందుకు సుమారు 60,000 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని (వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్) అందుబాటులోకి తెచ్చింది. భారత్, అమెరికా, కెనడా, యూకేలలోని అర్హులైన ఉద్యోగులకు ఈ అవకాశం కల్పించింది.సోమవారం కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మన్ ఈ విషయాన్ని ఉద్యోగులకు ఒక అధికారిక బ్లాగ్ పోస్ట్ ద్వారా తెలియజేశారు. ఇది పరిమిత కాల ఆఫర్ అని, అర్హులైన ఉద్యోగులు ఆర్థిక మద్దతు, కెరీర్ ప్లానింగ్ వనరులతో కంపెనీ నుంచి వైదొలగవచ్చని ఆమె పేర్కొన్నారు. లెవల్ 70, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులు దీనికి అర్హులు. దాదాపు 2,23,000 మంది ఉద్యోగులున్న మైక్రోసాఫ్ట్‌లో ఇది సుమారు 27 శాతం మందికి వర్తించనుంది.అయితే, ఈ ఆఫర్ అన్ని విభాగాలకు వర్తించదు. కంపెనీ వ్యాపార ప్రాధాన్యతలను బట్టి కొన్ని టీమ్‌లకు మాత్రమే దీన్ని అందిస్తున్నారు. కోపైలట్, కోర్ఏఐ, విండోస్, ఎక్స్‌బాక్స్, ఫైనాన్స్, హెచ్ఆర్ వంటి విభాగాలు ఈ జాబితాలో ఉన్నాయి. అదే సమయంలో మార్కెటింగ్, కమర్షియల్ బిజినెస్, సెక్యూరిటీ వంటి కొన్ని టీమ్‌లను దీని నుంచి మినహాయించారు.ఏఐ కంప్యూటింగ్, క్లౌడ్ సామర్థ్యాన్ని పెంచేందుకు మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్లపై భారీగా ఖర్చు చేస్తోంది. 2026 క్యాలెండర్ సంవత్సరంలో దాదాపు 175 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు అంచనా. ఈ భారీ పెట్టుబడులను సమన్వయం చేసుకునేందుకే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆఫర్‌ను స్వీకరించే ఉద్యోగులు డిసెంబర్‌లోగా తమ నిర్ణయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. అంగీకరించిన వారు డిసెంబర్ 31న కంపెనీ నుంచి నిష్క్రమిస్తారు.ఈ ఏడాది జులైలో మైక్రోసాఫ్ట్ సుమారు 4,800 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. అమెరికా వెలుపల భారత్‌లోనే మైక్రోసాఫ్ట్‌కు అత్యధిక ఉద్యోగులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఉద్యోగులపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. ఇది తప్పనిసరి తొలగింపు కానప్పటికీ, ఏఐ భవిష్యత్తుకు అనుగుణంగా కంపెనీ తన వర్క్‌ఫోర్స్‌ను పునర్‌వ్యవస్థీకరించుకోవడంలో ఇదొక కీలకమైన అడుగుగా టెక్ నిపుణులు భావిస్తున్నారు.

పాదరసాన్ని బంగారంగా మార్చేశాం.. అమెరికా స్టార్టప్ సంచలన ప్రకటన!



అణు సంలీన చర్యలో వెలువడిన న్యూట్రాన్లతో ఈ అద్భుతం సాధించామని వెల్లడి

సెర్న్ గత రికార్డును పది రెట్లు అధిగమించామన్న సంస్థ

ప్రయోగ వివరాలు, ఉత్పత్తి అయిన బంగారం పరిమాణంపై గోప్యత

వాణిజ్య స్థాయిలో బంగారం ఉత్పత్తికి ఇంకా చాలా సమయం పట్టవచ్చని నిపుణుల విశ్లేషణ

శతాబ్దాలుగా రసవాదులు కన్న కల... పనికిరాని లోహాలను విలువైన బంగారంగా మార్చాలన్న ఆశయం... సైన్స్ ఫిక్షన్ కథల్లో చదివిన అద్భుతం... ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన 'మ్యారథాన్ ఫ్యూజన్' అనే స్టార్టప్, అణు సంలీన టెక్నాలజీని ఉపయోగించి పాదరసాన్ని స్థిరమైన బంగారంగా మార్చినట్టు ప్రకటించి సంచలనం సృష్టించింది. తాము సాధించిన ఈ ప్రక్రియను 'హై-రేట్ ఆల్కెమీ'గా అభివర్ణించిన ఈ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాత పరిశోధన సంస్థ 'సెర్న్' రికార్డును సైతం 10 రెట్లు అధిగమించామని చెబుతోంది.

ప్రక్రియ ఎలా పనిచేస్తుంది?

రసాయనిక పద్ధతులతో ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం అసాధ్యం. కానీ, అణు కేంద్రకంలో మార్పులు తీసుకురావడం ద్వారా ఇది సాధ్యమేనని శాస్త్రవేత్తలు ఎప్పుడో నిరూపించారు. ఈ ప్రక్రియనే 'న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యూటేషన్' అంటారు. మ్యారథాన్ ఫ్యూజన్ సరిగ్గా ఇదే చేసింది.గత నెలలో జరిగిన ప్రయోగంలో, డ్యూటీరియం-ట్రిటియం అనే ఇంధనాలను ఉపయోగించి అణు సంలీన చర్యను ప్రారంభించారు. ఈ చర్యలో అత్యధిక శక్తి కలిగిన న్యూట్రాన్లు పుట్టుకొస్తాయి. ఈ న్యూట్రాన్లను పాదరసం ప్రత్యేక ఐసోటోప్ అయిన మెర్క్యురీ-198పైకి ప్రసరింపజేశారు. దీనివల్ల అది రేడియోధార్మికత కలిగిన మెర్క్యురీ-197గా మారింది. ఈ ఐసోటోప్ సుమారు 64 గంటల వ్యవధిలో సహజంగా క్షీణించి, స్థిరమైన గోల్డ్-197గా రూపాంతరం చెందింది. అలా పాదరసం కాస్తా మేలిమి బంగారంగా మారిపోయింది.

సెర్న్‌తో పోలిక.. కానీ ప్రశ్నలు అనేకం

నిజానికి ఇలా ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025లో సెర్న్‌లోని లార్జ్ హాడ్రాన్ కొలైడర్‌లో సీసం నుంచి సుమారు 29 పికోగ్రాముల (ఒక గ్రాములో లక్ష కోట్ల వంతు) బంగారం ఉత్పత్తి అయినట్టు ప్రకటించారు. అయితే, మ్యారథాన్ ఫ్యూజన్ తమ ఉత్పత్తి రేటు దానికంటే 10 రెట్లు ఎక్కువని చెబుతోంది.అయితే, ఈ ప్రకటనలో కొన్ని కీలకమైన వివరాలు లోపించాయి. ప్రయోగంలో ఎంత పరిమాణంలో బంగారం ఉత్పత్తి అయింది, దాని స్వచ్ఛత ఎంత, ఈ ప్రక్రియకు అయిన ఖర్చు వివరాలను సంస్థ వెల్లడించలేదు. కేవలం ప్రయోగానికి సంబంధించిన కొన్ని గ్రాఫ్‌లను మాత్రమే సోషల్ మీడియాలో పంచుకుంది. దీంతో ఈ ప్రకటనపై శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆసక్తితో పాటు అనేక ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

భవిష్యత్తు అంచనాలు.. వాస్తవ సవాళ్లు

మ్యారథాన్ ఫ్యూజన్ 2025లోనే విడుదల చేసిన ఒక పరిశోధన పత్రంలో, వాణిజ్య స్థాయిలో ఒక గిగావాట్ సామర్థ్యం గల ఫ్యూజన్ పవర్ ప్లాంట్ ద్వారా ఏటా సుమారు రెండు టన్నుల బంగారం ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేసింది. ఇది నిజమైతే ప్రపంచ బంగారం మార్కెట్‌పై పెను ప్రభావం చూపుతుంది. అయితే, ఇవి కేవలం సిమ్యులేషన్ల ఆధారంగా చేసిన అంచనాలు మాత్రమే. వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ రియాక్టర్లు అందుబాటులోకి రావడానికి ఇంకా దశాబ్దాల సమయం పట్టవచ్చు. అంతేకాక, ఈ పద్ధతిలో తయారైన బంగారంలో రేడియోధార్మిక అవశేషాలు ఉండే అవకాశం ఉందని, దానిని సురక్షితంగా మార్చేందుకు 14 నుంచి 18 ఏళ్లు నిల్వ ఉంచాల్సి రావచ్చని నివేదికలు చెబుతున్నాయి.కేవలం బంగారం తయారీ మాత్రమే కాకుండా, క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో ఉపయోగపడే కాపర్-64, కాపర్-67 వంటి అత్యంత విలువైన వైద్య ఐసోటోప్‌లను కూడా జింక్ నుంచి ఉత్పత్తి చేసినట్టు మ్యారథాన్ ఫ్యూజన్ ప్రకటించింది.మొత్తం మీద, ఒక మూలకాన్ని బంగారంగా మార్చడం శాస్త్రీయంగా సాధ్యమేనని మరోసారి నిరూపితమైంది. కానీ, దీనిని వాణిజ్యపరంగా లాభదాయకమైన, భారీ ఉత్పత్తి ప్రక్రియగా మార్చడానికి ఇంకా చాలా పరిశోధనలు, స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. అప్పటి వరకు, ఆధునిక రసవాదం ఒక అద్భుతమైన శాస్త్రీయ ప్రయోగంగానే మిగిలిపోనుంది.

రూపాయి కోలుకుంటోందనుకునేలోపే మళ్లీ పతనం..

డాలర్‌తో పోలిస్తే రూ.95 స్థాయి కీలకం

బ్యారెల్ ముడిచమురు ధర దాదాపు 115 డాలర్లు

జియో ఐపీఓ నిధుల మద్దతు తగ్గే అవకాశం

డాలర్లకు దిగుమతిదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్

ఆర్‌బీఐ చర్యలున్నా కొనసాగుతున్న ఒత్తిడి

అమెరికా ఫెడ్ నిర్ణయంపై మార్కెట్ల దృష్టి

డాలర్‌తో పోలిస్తే ఇటీవల కోలుకున్న భారత రూపాయికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు చర్యలు తీసుకున్నా.. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై అనిశ్చితి కరెన్సీపై ఒత్తిడి పెంచుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు సంబంధించిన విదేశీ నిధుల రాకతో గతవారం రూపాయికి కొంత మద్దతు లభించింది. అయితే ఆ ఊతం త్వరలో తగ్గిపోవచ్చన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.94.93గా నమోదైంది. శుక్రవారం ముగింపు రూ.94.94తో పోలిస్తే ఇది స్వల్పంగా బలపడినట్లే. అయితే ఆ తర్వాత రూపాయిపై మళ్లీ ఒత్తిడి పెరిగింది. సోమవారం ఉదయం 11.10 గంటల సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.95.115కు పడిపోయినట్లు రాయిటర్స్ నివేదించింది. డాలర్‌తో పోలిస్తే రూ.95 స్థాయిని దాటకుండా నిలదొక్కుకోవడం కీలకంగా మారింది.

ముడిచమురు ధరలే ప్రధాన సమస్య

రూపాయి రికవరీకి ప్రధాన అడ్డంకిగా ముడిచమురు ధరలు మారాయి. బ్రెంట్ క్రూడ్ ధర గతవారం ఆరు శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు దాదాపు 115 డాలర్ల స్థాయికి చేరింది. సౌదీ అరేబియాపై దాడుల నేపథ్యంలో చమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. ధరలు పెరిగితే దిగుమతుల బిల్లు పెరిగి, దేశ వాణిజ్య లోటుపై ఒత్తిడి పడుతుంది. ఇది రూపాయి విలువను మరింత బలహీనపరచవచ్చు.

ఐపీఓ నిధుల మద్దతు ఎంతకాలం?

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన వచ్చింది

సూర్యుడు అంతరించిపోయాక ఏం జరుగుతుంది?

మన సౌర కుటుంబానికి కేంద్రంగా ఉన్న సూర్యుడు మరో ఐదు బిలియన్ సంవత్సరాల వరకు ప్రస్తుతంలాగే ప్రకాశించే అవకాశం ఉంది. అయితే, ఆ తర్వాత సౌర కుటుంబంలో చోటుచేసుకునే పరిణామాలు శాస్త్రవేత్తలు గతంలో అంచనా వేసిన దానికంటే వేగంగా, సంక్లిష్టంగా ఉండొచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. సూర్యుడు తన జీవిత చక్రం చివరి దశకు చేరుకున్నప్పుడు గ్రహాల కక్ష్యల్లో తీవ్ర మార్పులు సంభవించే అవకాశముందని పరిశోధకులు అంచనా వేశారు.'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో ఖగోళ శాస్త్రవేత్తలు కాన్‌స్టాంటైన్ బాటిగిన్, జిమ్ ఫుల్లర్, ఫ్రెడ్ సి.ఆడమ్స్ తదితరులు పాల్గొన్నారు. సూర్యుడు తన జీవితకాలం ముగిసే సమయంలో ద్రవ్యరాశిని ఒకే విధంగా, క్రమంగా కోల్పోకపోవచ్చని వారు పేర్కొన్నారు. అసమానమైన విరామాల్లో జరిగే ద్రవ్యరాశి నష్టం సౌర కుటుంబంలోని బాహ్య గ్రహాల కక్ష్యలను ప్రభావితం చేయవచ్చని వివరించారు.సాధారణంగా సూర్యుడిలో హైడ్రోజన్ ఇంధనం తగ్గిపోయిన తర్వాత అది విస్తరించి ఎర్రటి రాక్షస నక్షత్రంగా మారుతుంది. అనంతరం తన బయటి పొరలను కోల్పోయి తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా మిగులుతుంది. ఈ పరిణామాల సమయంలో సూర్యుడి గురుత్వాకర్షణ ప్రభావం మారడంతో గ్రహాల కదలికల్లోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది.బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాల కదలికలను పరిశోధకులు వందలాది కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా పరిశీలించారు.

అనుపమ భోగి డబ్బింగ్ పూర్తి

చార్మింగ్ స్టార్ శర్వానంద్పీరియడ్ యాక్షన్ డ్రామా భోగి ప్రమోషనల్ కంటెంట్తో(ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర-ఆదిలాబాద్ సరిహద్దు(నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్(హీరోయిన్గా నటిస్తున్నారు. కందుల సులోచన రాణి పాత్రలో ఆమె ఫస్ట్ లుక్, పాటల్లో ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.తాజాగా అనుపమ పరమేశ్వరన్ తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియో నుంచి రిలీజ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ తో పాటు డింపుల్ హయాతి మరో హీరోయిన్గా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. నవంబర్ 12న థియేటర్స్లో రిలీజ్ కానుంది.



మా కాపురంలోకి మూడో వ్యక్తి.. నా భార్యను ఎవరో రెచ్చగొడుతున్నారు

బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా, ఆయన భార్య సునీత అహుజా మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. గోవిందా తన సహనటి కోమల్ రాణి స్వర్ణకర్తో సన్నిహితంగా ఉండడంపై సునీత తీవ్ర ఆరోపణలు చేయడంతో వారి బంధం వార్తల్లో నిలిచింది. నెలలుగా సాగుతున్న ఈ ప్రచారంపై గోవిందా ఎట్టకేలకు మౌనం వీడారు. తన భార్యను ఎవరో కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇద్దరి మధ్య ఓ పెద్ద గేమ్ ఆడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏబీపీ లైవ్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గోవిందా ఈ అంశంపై స్పందించారు. "ప్రస్తుతం ప్రజలు ఏమంటున్నారనే దానిపై నేను దృష్టి పెట్టడం లేదు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మహిళలు ఇలాగే స్పందిస్తున్నారు.



'బ్లాక్ నైట్ బాయ్స్'.. మరో సినిమా మొదలుపెట్టిన నటి దేవయాని కుమార్తె



సుస్వాగతం', 'చెన్నకేశవరెడ్డి', 'నాని' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి దేవయాని. ఇప్పుడామె కుమార్తె ప్రియాంక రాజకుమరన్ హీరోయిన్గా బిజీ అవుతున్నారు. ఇటీవల 'రంజన్: ది అడ్వకేట్' చిత్రంతో కథానాయికగా అరంగేట్రం చేసిన ఆమె, తాజాగా తన కొత్త సినిమాను ప్రారంభించారు. 'బ్లాక్ నైట్ బాయ్స్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. కాగా, ప్రముఖ తమిళ దర్శకుడు రాజకుమరన్ నటి దేవయాని భర్త అని తెలిసిందే. వీరికి ఇద్దరు కుమార్తెలు.. ఇనియ పెద్ద కుమార్తె కాగా, ప్రియాంక చిన్న కుమార్తె. ఇనియ గాయనిగా కెరీర్ నిర్మించుకుంటోంది. ప్రియాంక తల్లిబాటలో నటిగా అడుగులు వేస్తోంది. గతంలో దర్శకుడిగా స్టార్ హీరోలతో సినిమాలు చేసిన రాజకుమరన్ ప్రస్తుతం నటుడిగా కొనసాగుతున్నారు.ఈ చిత్రంలో సోషల్ మీడియాలో పాపులర్ అయిన అమల్జిత్ హీరోగా నటిస్తున్నారు. సెంబర్ వి. మురుగేశన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని, ఓ అందమైన ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా పూర్తి ఫ్యామిలీ ఎంటర్టైనర్గా 'బ్లాక్ నైట్ బాయ్స్' ఉంటుందని నిర్మాతలు పేర్కొన్నారు.ఈ సినిమాకు ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస కెమెరా బాధ్యతలు చేపట్టారు. 'కాదల్' వంటి కల్ట్ క్లాసిక్ చిత్రానికి సంగీతం అందించిన జోషువా శ్రీధర్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. బాబా భాస్కర్ నృత్యరీతులు, పి.సి. స్టంట్స్ ఫైట్స్ అందిస్తున్నారు. అరుణ్ మురుగన్ పిక్చర్, డ్రీమ్ రన్వే సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

'ఖలీఫా' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



మలయాళ కథానాయకులలో పృథ్వీరాజ్ సుకుమారన్ కి మంచి క్రేజ్ ఉంది. ఆయన హీరోగా రూపొందిన సినిమానే 'ఖలీఫా'. జిను అబ్రహం నిర్మించిన ఈ సినిమాకి వైశాఖ్ దర్శకత్వం వహించాడు. ఆగస్టు 20వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, 50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అక్టోబర్ 9వ తేదీ నుంచి ఈ సినిమా 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంలో రూపొందిన ఈ సినిమా, తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.యూనస్ అలీ .. ఒక నిజాయితీ పరుడైన బిజినెస్ మేన్. అయితే గతంలో అతని తండ్రి అహ్మద్ అలీ స్మగ్లింగ్ చేయడం వలన, ఆ మచ్చ అతని కెరియర్ పై పడుతుంది. ఆ కారణంగా అతని బిజినెస్ కూడా చిక్కుల్లో పడుతుంది. దాంతో అతను రాజకీయనాయకుడైన రాఘవన్ ను ఆశ్రయిస్తాడు. అతను ఒక పథకం ప్రకారం యూనస్ అలీ పై స్మగ్లింగ్ కేసు పెట్టించి అరెస్ట్ చేయిస్తాడు. ఊహించని ఈ సంఘటనకి యూనస్ కొడుకైన ఆమీర్ అలీ (పృథ్వీరాజ్ సుకుమారన్) షాక్ అవుతాడు. ఆమిర్ అలీకి ఫిజా (మాళవిక శర్మ)తో వివాహమవుతుంది. అతను తన భార్యతో కలిసి ఆనందకరమైన జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. ధర్మ బద్ధమైన జీవితాన్ని గడపాలనుకునే తండ్రినే అతనికి ఆదర్శం. అలాంటి పరిస్థితులలో తండ్రి జైలుకు వెళ్లడం ఆయనను కలచి వేస్తుంది. కావాలని తన తండ్రిని ఈ కేసులో ఇరికించారనే విషయం ఆయనకి అర్థమైపోతుంది. రాజకీయనాయకుడైన రాఘవన్ .. అతని కొడుకు వినాయకన్ .. హరీస్ అందుకు కారకులని ఆయన గ్రహిస్తాడు. ఈ కేసు నుంచి తన తండ్రిని బయటికి తీసుకురావాలంటే,పెద్ద మొత్తంలో డబ్బు అవసరమవుతుందనే విషయం ఆమీర్ అలీకి అర్థమవుతుంది. అప్పటి వరకూ తండ్రి సంపాదించినందంతా సీజ్ చేయబడుతుంది. దాంతో తనకి అవసరమైన డబ్బుకోసం అతను తన తాత మాదిరిగానే స్మగ్లింగ్ బాటపడతాడు. ఆ ప్రయాణంలో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా అధిగమిస్తాడు? అనేది మిగతా కథ.నీతిగా ఉండాలనుకోవడం .. నిజాయితీగా బ్రతకాలనుకోవడం అనుకున్నంత తేలిక కాదు. ధర్మబద్ధంగా నడచుకోవాలనుకోవడమే ఈ రోజులలో అసలైన సవాల్. అలాంటి ఒక నిజాయితీపరుడు .. కొంతమంది అరాచకుల వలన జైలుపాలవుతాడు. తన ఆస్తిపాస్తులపై అధికారాన్ని కోల్పోతాడు. అది భరించలేకపోయిన అతని కొడుకు, అవినీతిపరులకు ఎలా గుణపాఠం చెబుతాడు?

'100 సార్లేంటి.. వెయ్యిసార్లైనా పెళ్లి చేసుకోమని అడుగుతా!'

విజయ్ దేవరకొండను పెళ్లి చేసుకోవాలని వందసార్లు అడిగానన్న వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు నటి రష్మిక మందన్న గట్టిగా బదులిచ్చింది. తన ప్రేమ, పెళ్లి గురించి ఇతరులు తీర్పులు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు తనకు ఉందని, విజయ్ను మళ్లీ మళ్లీ ఎంచుకుంటానే ఉంటానని చెప్పింది. 'వెయ్యిసార్లైనా ఇదే నిర్ణయం తీసుకుంటా.. వందసార్లు అనేది పెద్ద విషయమే కాదు' అంటూ ట్రోలర్లకు సమాధానమిచ్చింది. ఇటీవల 'కాఫీ విత్ కరణ్-9' కార్యక్రమానికి సంబంధించిన ప్రోమోలో రష్మిక, విజయ్ తమ పెళ్లి గురించి మాట్లాడారు. తాను పెళ్లి చేసుకుందామని విజయ్ను ఏడాది పాటు అడిగానని రష్మిక చెప్పింది. దాదాపు వందసార్లు అడిగిన తర్వాతే



విజయ్ అంగీకరించాడన్న విషయం చర్చకు దారితీసింది. విజయ్ ఆమెను అవమానించాడంటూ కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో రష్మిక తన సోషల్ మీడియా పోస్ట్తో స్పందించింది. తమ మధ్య ప్రేమ అనేది పెళ్లి ప్రపోజల్, ఉంగరం తొడగడం వంటి విషయాలకే పరిమితం కాదని రష్మిక తెలిపింది. జీవితాన్ని కలిసి నిర్మించుకోవడమే అసలైన విషయమని పేర్కొంది. తాను భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకునే వ్యక్తినని, విజయ్ మాత్రం అన్ని కోణాల్లో ఆలోచిస్తాడని చెప్పింది. ఈ భిన్నత్వమే తమ బంధానికి బలమని వివరించింది.తనకు కష్టాలు ఎదురైనప్పుడు విజయ్ అండగా నిలిచాడని రష్మిక చెప్పింది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.